కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు కటికం సత్తయ్య గౌడ్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, పక్కన సత్తయ్యగౌడ్

మోతె, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు కటికం సత్తయ్యగౌడ్ పిలుపునిచ్చారు. పోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 24న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నిర్వహించే రోడ్‌షోలో మోతె మండలం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగడుకునా నిలదీయాలన్నారు. రుణమాఫీ, రైతు బంధు రూ.15వేలకు పెంపు వంటి వాటిని అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రైతులే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఎగ్గొట్టేందుకే ధాన్యం కొనుగోలుపై సమీక్షల పేరుతో ప్రభుత్వం కాలం వెళ్లబుచ్చుతున్నదని విమర్శించారు. ఇప్పటికైనా ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ప్రజలు నిలదీయాలన్నారు. రైతుల తరుపున కడదాక కొట్లాడే ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమే అన్నారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణ హక్కులను కాపాడుకోవాలని కోరారు. రైతు కుటుంబానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులు, మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, నాయకులు ఏలూరి వెంకటేశ్వర్‌రావు, ముప్పాని శ్రీధర్‌రెడ్డి, నూకల శ్రీనివాస్‌రెడ్డి, మద్ది మధుసూదన్‌రెడ్డి, వెంకన సంజీవరెడ్డి, మిక్కలినేని సతీశ్, జాని పాషా, కొండ వెంకన్న, భూక్య గాంధీ పాల్గొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

మునగాల : ఈ నెల 24న సూర్యాపేట పట్టణంలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటారని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు కటికం సత్తయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం వారు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేశ్ అధ్యతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి ఎలక వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు అజయ్‌కుమార్, సహకార సంఘం చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, మాజీ జడ్పీటీసీ కోల ఉపేందర్ రావు, సోమపంగు సైదులు పాల్గొన్నారు.

మతం ముసుగులో రాజకీయ లబ్ధికి బీజేపీ యత్నం

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్

లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 22 : మతం ముసుగులో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. మార్క్సిస్టు నాయకుడు లెనిన్ 154వ జయంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద, ఫాసిస్ట్ విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి చట్టాలను సవరిస్తున్నదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇప్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు కంచనపల్లి సైదులు, నాయకులు సామ నర్సిరెడ్డి, బొల్లె వెంకన్న, పెద్దింటి అశోక్‌రెడ్డి, బానాల వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

జాన్‌పహాడ్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు, సిబ్బంది

పాలకవీడు, ఏప్రిల్ 22 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వసుందర మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ యాక్టివిటీ, మేథో వికాసం, బాషాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కిండర్ గ్రాడ్యుయేషన్‌డే

నూతనకల్ ; ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని నాగార్జున నెట్స్ ఒలింపియాడ్ పాఠశాలలో సోమవారం కిండర్ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చదువులో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకన్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఆర్డీఓ వేణుమాధవరావు

వెలిశాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

తిరుమలగిరి, ఏప్రిల్ 22 : మండలంలో మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు ఇబ్బంది పడుతున్న అన్నదాతలు శీర్షికతో సోమవారం నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని వెలిశాల, గుండెపురితో పాటు పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీఓ వేణుమాధవరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలు, ఎగుమతుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, కాంటా వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లులకు పంపించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడువకుండా జాగ్రత్త వహించాలి
- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

వల్లభాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

చివ్వెంల, ఏప్రిల్ 22 : ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. సోమవారం చివ్వెంల మండలం వల్లభాపురంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తెచ్చి ప్రభుత్వ అందించే మద్దతు ధర పొందాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 89,598.480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ. 60 కోట్లకు పైగా చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం తడువకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, డీఎస్ఓ మోహన్ బాబు, తాసీల్దార్ కృష్ణయ్య, సాయి గౌడ్ ఉన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

కోదాడ రూరల్ : పట్టణ పరిధిలోని తమ్మరశివారులోని శ్రీధనలక్ష్మి పార్‌బాయిల్డ్ మిల్లును సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తనిఖీ చేశారు. మిల్లులోని బియ్యాన్ని, రికార్డులను పరిశీలించారు. మిల్లు యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని సూచించారు. ఆర్డీఓ సూర్యానారాయణరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీపీ ధరావత్ కుమారీబాబూనాయక్

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారీబాబునాయక్

చివ్వెంల, ఏప్రిల్ 22 : గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ ధరావత్ కుమారీబాబూనాయక్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం అధికారులు తమశాఖ పరిధిలో జరిగిన అభివృద్ధి నివేదికను సభముందు ఉంచారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డేవిడ్‌కుమార్

మార్కెట్ కార్యదర్శి రాహుల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 22 : తేమతో పని లేకుండా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రాహుల్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యానికి క్వింటాకు రూ. 500ల బోనస్ ఇవ్వాలని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇప్టు జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, నాయకులు బొల్లె వెంకన్న, సామ నర్సిరెడ్డి, గజ్జల మల్లారెడ్డి, జయరాజు, దండి ప్రవీణ్, మందడి శశి, వెంకన్న పాల్గొన్నారు.

మహేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం

మహేశ్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగారం, ఏప్రిల్ 22 : మండలంలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కంపసాటి మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు విషయాన్ని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం పంపించారు. అట్టి సాయాన్ని సోమవారం బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు రామలింగయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కాసనబోయిన వెంకన్న, నాయకులు సురేశ్, సైదులు, గణేశ్, సత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

- అఖిలపక్ష రైతు సంఘం నాయకులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 22 : మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఎన్‌కేఎం బయో పియుల్స్ ఇథనాల్ కంపెనీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ధరిత్రీ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక వాణిజ్యభవన్ సెంటర్‌లో రావిపహాడ్ వద్ద నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కండాల శ్రీనివాస్, మండారి డేవిడ్‌కుమార్, కొప్పోజు సూర్యనారాయణ, పి. నగరాజు, కోట గోపీ మాట్లాడుతూ తక్షణమే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కంపెనీ వల్ల స్థానికులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, జక్కుల రమేశ్, మధు, గంట నాగయ్య, గునుగుంట్ల సైదులు, బొడ్డు శంకర్, కాంచనపల్లి సైదులు, కిరణ్, బొల్లేపల్లి వెంకన్న, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయ నాయుడు

పాలకవీడు, ఏప్రిల్ 22 : దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా నాయకుడు ధనుంజయ నాయుడు కోరారు. సోమవారం మండలంలోని గుండెబోయిన గూడెం గ్రామంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ప్రజాస్వామ్య పాలన తగ్గి, పెట్టుబడిదారి విధానం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుందని, ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తునదని పేర్కొన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే కార్మికులందరూ ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రజలు చైతన్యవంతులై బీజేపీని ఓడించాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకన్న, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోదాడ రూరల్, ఏప్రిల్ 22: పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన కె. రాము(44) సోమవారం కడుపు నొప్పి తాళలేక గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము పట్టణంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా షుగర్, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి అధికం కావడంతో ఇంట్లో గుర్తు తెలియని మాత్రలు అధిక మొత్తంలో మింగి ఆత్యహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ రంజిత్ తెలిపారు.

కంచర్ల రోడ్‌షోను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి

మఠంపల్లి, ఏప్రిల్ 22 : ఈ నెల 27న మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రోడ్ షోను జయప్రదం చేయాలని పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రోడ్‌షోకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మఠంపల్లి, హుజూర్‌నగర్ జడ్పీటీసీలు జగన్‌నాయక్, కొప్పుల సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోలాహలం కృష్ణంరాజు, సాముల పుల్లారెడ్డి, హఫీజ్‌ఖాన్, ఇరిగెల వెంకటరెడ్డి, పిండిప్రోలు రామచంద్రయ్య, జాల కిరణ్, కొమ్ము సైదులు, ఎంపీటీసీలు కుందూరు వెంకటరెడ్డి, సైదమ్మ, జ్యోతి, బీసీ సంఘం మండలాధ్యక్షుడు నాగయ్య, కోటానాయక్, బాలూనాయక్, రాజీవ్ పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

- మోతెలో 44.9 డిగ్రీలు నమోదు
- వడ గాలులతో అల్లాడిన ప్రజలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 22 : సూర్యాపేట జిల్లాలో సోమవారం భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. ఆదివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి వాతావరణం చల్లబడినట్లు కనిపించినప్పటికీ మరుసటి రోజే ఎండ దంచి కొట్టింది. సూర్యాపేట జిల్లా మోతె మండలంలో అత్యధికంగా 44.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేటలో 42 డిగ్రీలు నమోదు కాగా మిగతా ప్రాంతాల్లో కూడా 40 డిగ్రీల కంటే అధికంగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికి తోడు వడ గాలులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఎండ వేడికి ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రస్తుతం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్త వహించాలని, అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

వేంకటేశ్వరుడి బహ్మోత్సవాలు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 22 : స్థానిక వేంకటేశ్వరస్వామి, నరసింహస్వామి ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చనలు, విశ్వక్సేన పూజలు, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ద్వజారోహణ పూజలను అర్చకులు నరగిరినాథుడి రంగభట్టరాచార్యులు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

స్వయంభువుడికి ప్రత్యేక పూజలు

స్థానిక స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొంకపాక శివవిష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ స్వామివారిని పూలతో విశేషంగా అలంకరించారు. మండల కేంద్రానికి చెందిన ముడెం వెంకటరెడ్డి,మంగమ్మ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఈఓ గుజ్జుల కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విగ్రహప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రెడ్లకుంటలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని రెడ్లకుంట గ్రామంలో గంగా పార్వతీ సమేత లింగమంతుల స్వామి ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, కాపుగల్లు పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, మాజీ సర్పంచ్ సాధినేని లీలా అప్పారావు, గంగవరపు లక్ష్మణ్‌రావు, కనగాల నాగేశ్వర్‌వు, తొండపు సతీశ్, మల్లెల బ్రహ్మయ్య, ఉన్నం హనుమంతరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోటు రమేశ్‌బాబుకు పలువురి నివాళి

గరిడేపల్లి, ఏప్రిల్ 22 : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు పోటు రమేశ్‌బాబు 12వ వర్ధంతిని పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రమేశ్‌బాబు విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోటు ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రైతుసంఘ నాయకులు పోటు పూర్ణచందర్‌రావు, కుటుంబ సభ్యులు పద్మ, కృష్ణబాబు, సింధు, పార్టీ గ్రామ కార్యదర్శి తిరగమళ్ల కిరణ్, నాయకులు కట్టా అశోక్, పగడాల శ్రీనివాస్, బాలశౌరి, నవీన్‌చారి, మటయ్య పాల్గొన్నారు.

కంటైనర్ కిందికి దూసుకెళ్లిన కారు

- ప్రమాదంలో దంపతుల మృతి
- మునగాల మండలం ముకుందాపురం వద్ద ఘటన

కంటైనర్ కిందికి దూసుకుపోయిన కారు

మృతులు నవీన్‌రాజ్, భార్గవి (ఫైల్)

మునగాల, ఏప్రిల్ 22 : రోడ్డుపై నిలిచి ఉన్న కంటైనర్ కిందికి కారు దూసుకు పోవడంతో దంపతులు మృతి చెందిన ఘటన మండలంలోని ముకుందాపురం సమీపంలో హెచ్‌పీ పెట్రోబంక్ ఎదుట సోమవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన సామినేని నవీన్ రాజ్ (29) కు ఆంధ్రాలోని ఎన్‌టీఆర్ జిల్లా విసన్నపేట గ్రామానికి చెందిన భార్గవి (26)తో రెండేండ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేదు. నవీన్‌రాజ్ కృష్ణాజిల్లా గూడవల్లిలోని శ్రీచైతన్య కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తుండగా భార్గవి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ విజయవాడలో నివాసముంటున్నారు. నవీన్‌రాజ్ తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లో ఉంటున్నారు. ఈ నెల 20న భార్గవి పుట్టినరోజు వేడుకను జరుపుకొనేందుకు దంపతులు కారులో హైదరాబాద్ వెళ్లారు. శనివారం పుట్టిన రోజు వేడుకను చుట్టాల మధ్య ఆనందంగా జరుపుకొన్నారు. సోమవారం ఉదయం కాలేజీ విధులకు హాజరయ్యేందుకు నవీన్‌రాజ్, భార్గవితో కలిసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యంలో ముకుందాపురం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన కంటైనర్ కిందికి దూసుకెళ్లింది. దాంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు జేసీబీలు, క్రేన్, ట్రాక్టర్ సాయంతో కంటైనర్ కింద ఇరుక్కున్న కారును అతికష్టం మీద బయటికి తీశారు. కారులో ఉన్న నవీన్‌రాజ్, భార్గవి మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి.

పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటన బంక్ సీసీ కెమెరాలో నమోదైంది. బంక్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు. సీఐ రామకృష్ణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు : ఏపీఎం

నూతనకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున ఏపీఎం కర్ణాకర్

నూతనకల్, ఏప్రిల్ 22 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో మోసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీఎం కర్ణాకర్ నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం మండలంలోని చిల్పకుంట్ల, తాళ్లసింగారం, నూతన్‌కల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కాంటాలు త్వరగా పూర్తి చేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓలు జానయ్య, శ్రావణి, రైతులు ఉన్నారు.